

ఆర్డీవోగా చల్లా విశ్వనాథ్



నంద్యాల రూరల్, అక్టోబరు, 28 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల రెవెన్యూ డివిజనల్ అధికారిగా చల్లా విశ్వనాథ్ నియమితులయ్యారు. సోమవారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు హంద్రీ నీవా సుజల స్రవంతి-3 విభాగపు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై నంద్యాల ఆర్డీవోగా వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నంద్యాల డివిజన్ పరిధిలోని పలు అంశాలపై చర్చించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్డీవో మల్లికార్జునరెడ్డిని సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

29 నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్

నంద్యాల కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ కోసం ఈ నెల 29 నుంచి బుకింగ్ చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. సోమవారం జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన పేద కుటుంబాలకు సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ పథకం కింద అర్హత పొందాలంటే వినియోగదారుడు గ్యాస్ కనెక్షన్, ఆధార్ నెంబర్, బియ్యం కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 31 నుంచి 2025 మార్చి వరకు మొదటి సిలిండర్ కోసం బుక్ చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 24 నుంచి జూలై లోపు రెండో సిలిండరు, ఆగస్టు నుంచి నవంబరులోపు మూడో సిలిండర్ ఇస్తామని తెలిపారు.

దొంగలు అరెస్టు

రూ.5 లక్షల విలువ చేసే విగ్రహాలు స్వాధీనం

బనగానపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో దొంగతనం చేసే ఓ ముఠాలోని ఇద్దరిని అరెస్టు చేసినట్లు బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. నంద్యాల పట్టణంలోని వైస్ నగర్‌కు చెందిన కొండపల్లి కమల్‌నాథ్, చాబోలి మంజులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి పంచలోహ విఘ్నేశ్వర విగ్రహం, దేవతా విగ్రహాలను అలంకరించే వెండి, బంగారు వస్తువులు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. అవుకు మండలం కునుకుంట్ల గ్రామ పొలిమేరలో ఉన్న పెద్దమ్మ గుడి, పూజారి ఇంటిలో, బేతంచెర్ల శివారులో ఉన్న అయ్యప్పస్వామి గుడి వద్ద పాములపాడు మండలం కృష్ణరావు పేటలో ఉన్న శివాలయంలో వీరు దొంగతనాలకు పాల్పడినట్లు సీఐ వివరించారు. కొండపల్లె కమలనాథ్ తాను దొంగిలించిన సొమ్ము నంద్యాలలోని చాబోలి మంజుల వద్ద ఉందని చెప్పగా అక్కడికి వెళ్లి ఆమెను కూడా అరెస్టు చేశామని చెప్పారు. వీరి వద్ద మొత్తం 30 తులాల వెండి, 70 గ్రాముల బంగారు, రూ.85 వేల నగదు, 11 కిలోల సుబ్రమణ్యేశ్వరస్వామి పంచలోహ విగ్రహం, 26.40 కిలోల విఘ్నేశ్వర విగ్రహం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొత్తం రూ.5లక్షల విలువ ఉంటుందని వివరించారు. అలాగే రెండు మోటార్ సైకిళ్లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో అవుకు ఎస్ఐ రాజారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళి వసూళ్లు..!



నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న టపాసుల దుకాణాలు

- దుకాణాల అనుమతుల పేరిట ఓ నాయకుడి దందా
- ఒక్కో షాపు నుంచి రూ.40 వేలు డిమాండ్
- తెలిసీ పట్టించుకోని అధికారులు

నంద్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):

దీపావళి అంటే టపాసుల మోతలు.. వాటిని కొనేందుకు వెళ్లే వారితో కళకళలాడే దుకాణాలు గుర్తుకొస్తాయి. అయితే ఈ దుకాణాల అనుమతుల పేరిట ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా ఓ నాయకుడు దందాకు తెరతీశాడు. ఒక్కో దుకాణం నుంచి వేలల్లో వసూలు చేసే పనిలో పడ్డాడు. పండుగ సమయంలో అనుమతుల కోసం అధికారులు సమావేశం నిర్వహించడం ఆలస్యం సదరు నేత రంగంలోకి వచ్చేశాడు. అధికారులు అనుమతుల కోసం సొంతంగా వెళ్లవద్దని, తన ద్వారా వెళితే ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటానంటూ మభ్యపెడుతూ వేల రూపాయలు దండుకుంటున్నాడు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్ అయ్యే ఈ నేతపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నేరుగా వెళ్లనివ్వకుండా..

టపాసులు అమ్ముకునే వారి కోసం దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా పట్టణ అధికారులు సమావేశం నిర్వహిస్తారు. అనంతరం దుకాణాల అనుమతుల కోసం దుకాణాదారులు మునిసిపాలిటీ, అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అగ్నిప్రమాదాల నివారణకు సంబంధిత శాఖ నుంచి, ప్రకటనలు, తాత్కాలిక దుకాణాల ఏర్పాటు కోసం మునిసిపాలిటీ పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి, మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య విభాగానికి చలానాలు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో ఎక్కడ కూడా మధ్యవర్తితో పనిలేదు. దుకాణాలు ఏర్పాటు చేయదలుచుకున్న వ్యక్తి నేరుగా సంబంధిత శాఖల అధికారులను సంప్రదిస్తే సరిపోతుంది. కానీ అలా అన్ని పనులు సక్రమంగా జరిగిపోతే తనకు ఏం మిగులుతాయనుకున్నాడో ఏమో ఓ వ్యక్తి దుకాణాల అనుమతుల కోసం తనను సంప్రదించాలంటూ గాలం వేశాడు. అన్ని చలానాలు కలిపి రూ.38 వేలకు చేస్తామని, ఎవరు ఎక్కడకు వెళ్లకూడదని, లేకపోతే ఆ తర్వాత అధికారులతో ఇబ్బందులు వస్తాయని తన అనుచరులతో సుతిమెత్తగా బెదిరించే పనికి పూనుకున్నాడు. ఈ విషయం సోషల్ మీడియా గ్రూపుల్లో కొద్ది రోజుల కిందట తెగ చక్కర్లు కూడా కొట్టింది.

మిగతా 6లో

సైలెంట్ కిల్లర్..!
బీపీ, షుగర్ కొలెస్ట్రాల్‌తో పక్షవాతం
నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే 7
వినతులన్నీ పరిష్కరిస్తాం
ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా 7
వైద్యుల సమస్యలు పరిష్కరిస్తాం
ఎంపీ బైరెడ్డి శబరి 7
కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా కె.వెంకటేశ్వర్లు 6

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు సత్వరమే పరిష్కా రం చూపాలని కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, స్పెష ల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలన్నారు. ఇంకా 30 ఫిర్యాదులు చూడనే లేద ని అన్నారు. బీయాండ్ఎస్ఎల్ఏలో 29 దరఖాస్తులు, రీఓపెన్ అయిన దరఖాస్తులు 205 ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వస్తున్నాయని, సంబంధిత తహసీల్దార్లతో సమావేశాలు నిర్వహించి ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీ సేవా సర్వీసులకు సంబంధించిన దరఖాస్తులు కూడా అధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 198 మంది తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే రుద్రవరం మండలంలో క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని అన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, మండలాల్లో రక్షిత తాగునీటి వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ మొత్తాన్ని ఈ నెల 30వ తేదీనే డ్రా చేసుకొని నవంబరు 1వ తేదీన లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

రహదారులు నాగరికతకు చిహ్నాలు


మంత్రి ఎన్ఎండీ ఫరూక్



రహదారి సమస్యలను మంత్రికి వివరిస్తున్న మహిళ

నంద్యాల రూరల్, అక్టోబరు, 28 (ఆంధ్రజ్యోతి) : రహదారులు నాగరికతకు చిహ్నాలు అని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని పలు రహదారులను ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని రోడ్ల సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రహదారులను బాగు చేయడానికి పూనుకున్నదని అన్నారు. ప్రజలకు ప్రాధాన్యత అవసరాలను బట్టి ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రోడ్లు బాగలేక ప్రజలు అవస్థలు పడిన తీరును చూస్తే బాధ కల్గుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యత ప్రమాణాలతో రహదారులు వేయడానికి కృషి చేస్తామని చెప్పారు. నంద్యాల పట్టణంలోని రహదారులను అనుసంధానం చేయిస్తామని తెలిపారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఫయాజ్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, షబ్బీర్, బుజ్జి పాల్గొన్నారు.

శ్రీశైలానికి నిలకడగా ఇన్‌ఫ్లో




శ్రీశైలం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. సోమవారం జూరాల నుంచి 17,341 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 13,236 క్యూసెక్కులు మొత్తం 30,577 వరద నీరు వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 34,284 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 209.1579 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,879 క్యూసె క్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,600 క్యూసెక్కులు మొత్తం 67,479 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

కార్తీక మాసం వేడుకలకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఈవో

శ్రీశైలం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలంలో నవంబరు 2 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. దీంతో శ్రీగిరికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలివచ్చే అవకాశం ఉంది. ఇందులో భాగంగా సోమవారం ఆలయ ఈఓ ఈ.చంద్రశేఖరరెడ్డి సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయంలోని క్యూలైన్లు, లడ్డూ ప్రసాదాల తయారీ, ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణిహారతి ఏర్పాట్లు, పాతాళగంగ, క్షేత్రపరిధిలోని పార్కింగ్ ప్రదేశాలు మొదలైన వాటిని పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలలో తగినంత లైటింగ్, సూచిక బోర్డులు స్పష్టంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.నరసింహారెడ్డి, పారిశుధ్య విభాగ పర్యవేక్షకుడు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి పెచ్చుమీరిందా.. అక్కడి సిబ్బంది, అధికారుల అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందా.. కర్నూలు నగరంలో వెలుస్తున్న అనధికారిక నిర్మాణాలను చూస్తుంటే అవుననే చెప్పాలి. నగరంలోని 52 వార్డుల్లో సుమారు ఏడు లక్షల జనాభా ఉంది. ప్రతి నెలా నగర పట్టణ ప్రణాళిక విభాగానికి సుమారు 30 నుంచి 45 వరకు దరఖాస్తులు వస్తుంటాయి. ప్రతి సంవత్సరం నగర పాలక సంస్థకు రూ.40 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. అనుమతులు సక్రమంగా తీసుకుంటే ఇంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే కొంత మంది అధికారుల చేతివాటంతో అక్రమ నిర్మాణాలు భారీగా వెలుస్తున్నాయి. ఫలితంగా నగర పాలక ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

నోటీసులతో సరిపెడుతూ...

పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతోపాటు 130 మంది సచివాయాల పరిధిలో ప్లానింగ్ సెక్రటరీలో విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు ఉన్నారు. ఆయా వార్డుల్లో ఎక్కడ నిర్మాణం జరిగినా వారికి తెలిసిపోతుంది. అయినా అనధికారిక నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదు. కొంతమంది ప్లానింగ్ సెక్రటరీలు తమ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరిగినా పట్టించుకోవడం లేదు. ఒకవేళ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు వస్తే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో కొన్ని నెలలుగా నగరంలో విచ్చలవిడిగా అనధికారిక భవనాలు వెలుస్తున్నాయి.

అంతా తానై...

నగరంలోని ఓ వార్డు సచివాలయానికి చెందిన ప్లానింగ్ సెక్రటరీ అంతా తానై వ్యవహరిస్తున్నారు. నగరంలో ఎక్కడ భవన నిర్మాణం జరిగినా వెంటనే అక్కడ వాలిపోతుంటారు. తన సచివాలయ పరిధి కాకపోయినా భవనాల వద్దకు వెళ్లి యజమానులతో మంతనాలు సాగిస్తుంటారు. అనధికారిక భనాల నుంచి భారీ మొత్తంలో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సెక్రటరీపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. విభాగంలోని కొందరు అధికారులకు మామూళ్లు అందతుండడం వల్లే పట్టించుకోవడం లేదన్న విమర్శలుఉన్నాయి.



పైసల ప్లానింగ్

- మామూళ్ల మత్తులో పట్టణ ప్రణాళిక సిబ్బంది
- చూసీచూడనట్లుగా వదిలేస్తున్న అధికారులు
- విచ్చలవిడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- నగర పాలక సంస్థ ఆదాయానికి భారీగా గండి

మిగతా 6లో





ఆహా ఏమి రుచి..!

● గుట్టపాడు పాలకోవాకు భలే గిరాకీ ● రోజుకు 150 కిలోల అమ్మకం
● 35 ఏళ్లుగా తయారు చేస్తున్న మహబూబ్ బాషా

ఓర్వకల్లు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆ పల్లెకు ఎవరెళ్లినా నోరు తీపి కావాల్సిందే. ఎర్రటి మంటపై ఏకమైన చిక్కటి పాలు, పంచదారను రుచి చూడాల్సిందే. అంతటి ప్రాచుర్యం పొందింది గుట్టపాడు పాలకోవా. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆ పల్లెల్లోని ఓ ఇంటికి రోజూ ఉదయం, సాయంత్రం పాలవ్యాన్లు క్యూ కడుతాయి. వీటి కోసం ఓ మహిళ పొయ్యిలో మంట పెడుతూ గోలంలో వంట కాన్ని కలబోస్తూ కనిపిస్తుంది. సిద్ధమైన పాలకోవాను తూకం వేసి వినియోగదారులకు పంపే పనుల్లో ఆమె భర్త నిమగ్నమై ఉంటారు. 35 ఏళ్ల క్రితం వెలిగించిన పొయ్యి ఇప్పటికీ ఆ కుటుంబంలో వెలుగులు నింపుతూనే ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల నోరూ ఊరిస్తూనే ఉంది.

గుట్టపాడు గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా ఊరూరా సైకిల్‌పై తిరుగుతూ ఐస్‌క్రీం అమ్మేవారు. సాయంత్రం ఇంటికి రాగానే కారంపొండి దంచి గ్రామస్థులకు అమ్ముకునేవారు. ఇలా చెమటోడ్చి వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని పోషించేవాడు. రోజంతా కష్టపడినా అరకొర సంపాదనే. ఈ క్రమంలోనే పాలకోవా తయారీకి ప్రసిద్ధి అయిన తడకనపల్లెలో బంధువుల ఇంటికి అప్పుడప్పుడు వెళ్లేవారు. తాను ఆ దిశగా అడుగులు వేసి అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నారు. ఆ ఆలోచన రాగానే పాలకోవా తయారీ నేర్చుకున్నాడు. 35 ఏళ్ల క్రితం తన ఇంటి వద్ద ప్రత్యేకంగా పొయ్యి ఏర్పాటు చేసుకుని మెల్లగా తయారీ చేయడం ప్రారంభించాడు. రుచికరంగా ఉందన్న పేరు రాగానే వెనుదిరిగి చూసుకోలేదు. ఇప్పుడు రోజుకు 150 కిలోల పాలకోవాను తయారు చేసి విక్రయించే స్థాయికి చేరుకున్నాడు. ఈయనకు చేదోడువాదోడుగా భార్య మహ్మద్ రోషాబీ నిలిచింది. కోవా తయారీ బాధ్యత చూసుకుంటుండగా విక్రయించే వ్యవహారం బాషా చూసుకుంటున్నారు.

రోజుకు 150 కిలోల అమ్మకం

మిఠాయిల్లో పాలకోవాది ప్రత్యేక స్థానం. మిగిలిన వాటితో పోలిస్తే.. ధర కూడా కాస్త ఎక్కువే. అయినా సరే పెళ్లిళ్లు, పేరంటాలు తదితర శుభకార్యాల్లో పాలకోవాను తప్పనిసరిగా వడ్డిస్తుంటారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన రుచికరమైన పాలకోవా ఎక్కడ లభిస్తుందోనని ఆరా తీసి మరీ ఇక్కడికి వచ్చి ఆర్డర్స్ ఇస్తుంటారు. ఈ కారణంగా జిల్లాలో గుట్టపాడు పాలకోవాకు భలే డిమాండ్ పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి ఆర్డర్స్ క్రమం తప్పకుండా వస్తుంటాయి. స్వీట్ స్టాల్స్, బేకరీలు, హోటళ్లకు నిరంతరం సరఫరా చేస్తున్నారు. దీనికి తోడు కిలో, అరకిలో ప్రకారం ఇళ్లకు పాలకోవాను తీసుకెళ్లేందుకు కూడా ఇక్కడికి వస్తుంటారు. రోజుకు 150 కిలోల పాలకోవా అమ్మకం జరుగుతోంది.



కిలో పాలకోవా రూ.200

పాలకోవా వ్యాపారం ప్రారంభించిన తొలి రోజుల్లో రోజుకు 25 కేజీలు తయారు చేసేవారు. ప్రస్తుతం 150 కేజీలు తయారు చేస్తున్నారు. ఇందు కోసం 180 లీటర్ల పాలు, వంద కేజీల పంచదారను వినియోగిస్తున్నారు. కిలో రూ.200 ప్రకారం విక్రయిస్తున్నారు. ఖర్చులన్నీ పోనూ రోజుకు రూ.2 వేలు దాకా మిగులుతుందని బాషా చెబుతున్నారు. ఆయన భార్య రోషాబీ పొదుపు సంఘంలో రుణం తీసుకుని వ్యాపారంలో ఖర్చుకు వినియోగిస్తోంది.

అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం

గుట్టపాడులో గ్రామసభలు జరిగినప్పుడు మహబూబ్ బాషా ఇల్లు రద్దీగా ఉంటుంది. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులకు ఈ పాలకోవా అంటే భలే ఇష్టం. దీంతో రెండు మూడు రోజులకు ముందే మహబూబ్ బాషాకు ఆర్డర్లు ఇస్తారు. గ్రామ సభ ముగియగానే ఒక్కొక్కరు కిలో, రెండు కిలోల చొప్పున తీసుకెళ్తారు. పాలకోవా కోసమే చాలా దూరం నుంచి ఈ గ్రామానికి వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా నుంచి 50 నుంచి 60 కిలోల చొప్పున ఆర్డర్స్ వస్తుంటాయి. 10 లేదా 15 రోజుల ముందే ఆర్డర్స్ ఇస్తుంటారు.



పాలకోవా తయారు చేస్తున్న మహమ్మద్ రోషాబీ

పాలకోవా తినాల్సిందే



మా ఇంటికి ఎవరు వచ్చినా పాలకోవా తినాల్సిందే. బంధుమిత్రులు వస్తే.. వెంటనే పాలకోవా తెప్పిస్తాం. మా ఊరి పాలకోవాకు మంచి గిరాకీ ఉంది. ఒకసారి పాలకోవా తిన్నవారు మళ్లీ అడిగి తెప్పించుకుంటారు.

- మోహన్ రెడ్డి, సర్పంచ్ గుట్టపాడు

రుణం ఇస్తే.. మరింత విస్తరింపజేస్తాం



35 ఏళ్లుగా పాలకోవాను తయారు చేస్తున్నాం. నా భార్య మహ్మద్ రోషాబీ, కూతురు రహీమాలు ఇంటి వద్ద పాలకోవా తయారు చేస్తారు. విక్రయించే బాధ్యత నాదే. నంద్యాల, కర్నూలు, బేతంచెర్ల, పాణ్యం, తెలంగాణలోని గద్వాల, ఐజ, గుంతకల్లు, ఎర్రవలి తదితర ప్రాంతాలకు వెళ్లి పాలకోవాను విక్రయిస్తుంటాను. వచ్చిన ఆదాయంతో సొంత ఇల్లు కట్టుకున్నా. నా కుమారుడు మహమ్మద్ బాషా డిప్లమా చేస్తున్నాడు. బ్యాంకు రుణం ఇస్తే వ్యాపారాన్ని మరింత విస్తరిస్తాను.

- మహబూబ్ బాషా, పాలకోవా తయారీదారుడు

కర్నూలు పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా కె.వెంకటేశ్వర్లు

ఉత్తర్వులు జారీ చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డా.కె.వెంకటేశ్వర్లును నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కేటీ కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎఫ్ఏసీగా ఉన్న డా.సి.ప్రభాకర్ రెడ్డి కార్డియోథొరాసిక్ హెచ్‌వోడీగా కొనసాగనున్నారు. కొత్త సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు గత 22 సంవత్సరాలుగా కర్నూలు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ విభాగంలో పని చేస్తున్నారు. ఆసుపత్రిలో మొట్టమొదటి కీళ్ల మార్పిడీ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి పేరొందారు.

కోరుకొండ సైనిక్ స్కూల్లో విద్యాభ్యాసం

కర్నూలు జిల్లా గూడూరు పట్టణానికి చెందిన కె.దుబ్బన, కె.లింగమ్మ దంపతులకు ముగ్గురు మగ సంతానంలో చివరి కుమారుడు కెవెంకటేశ్వర్లు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఈయన 1 నుంచి 12వ తరగతి వరకు సైనిక్ స్కూల్ కోరుకొండలో చదివారు. 1985 నుంచి 95 వరకు గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఎంఎస్, ఆర్థో పూర్తి చేసి 1998 కేఎంసీలో ఆర్థోపెడిక్ అసిస్టెట్ ప్రొఫెసర్‌గా వైద్య వృత్తిలో అడుగు పెట్టారు. 2010లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా రెండేళ్లు వరంగల్‌లో పని చేసి తిరిగి కర్నూలు కేఎంసీకి వచ్చారు. 2015లో ప్రొఫెసర్‌గా 2024 అక్టోబరు 28న కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కొత్త సూపరింటెండెంట్ మాట్లాడుతూ రోగుల కేర్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తానని, క్యాజువాల్టీ, సూపర్ స్పెషాలిటీ, ఎంసీహెచ్‌లో మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు.

ఫిర్యాదు చేశారని బెదిరింపులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బోగస్ సర్టిఫికెట్లు ఏరివేయాలని ఫిర్యాదు చేసిన వారిపై కొంతమంది బెదిరింపులకు దిగుతున్నారని ఏపీడీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి అన్నారు. 2002లో పారా మెడికల్ ఉద్యోగుల రిక్రూట్‌మెంటు నోటిఫికేషన్ జారీ చేయగా కొంతమంది బోగస్ సర్టిఫికెట్లతో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ఉద్యోగాలు పొందారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించి ఏరివేయాలని, ప్రభుత్వ సంస్థల నందు శిక్షణ పొందిన వారికి న్యాయం చేయాలని ఏపీ రాష్ట్ర లోకాయుక్త సంస్థకు బాధితులు ముత్యాల బాలుడు, బీజీవేముల అంకిరెడ్డి ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో ఉమ్మడి 13 జిల్లాల్లో విద్యార్హత పత్రాల విచారణ నిమిత్తం వచ్చే నెల 5న లోకాయుక్తకు పంపించాలని సర్క్యులర్ జారీ అయిందని వివరించారు. దీంతో బోగస్ సర్టిఫికెట్‌దారులు ఫిర్యాదు చేసిన బాధితులకు ఫోన్ చేసి బెదిరింపు చర్యలకు దిగినట్లు వారు తెలిపారు. వారికి రక్షణ కల్పించాలని ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డితోపాటు రాష్ట్ర ప్రతినిధులు మునిరెడ్డి, చాంద్‌బాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇసుక అదనపు ఫీజులు రద్దు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇసుకకు సీనరేజ్ ఫీజు, డీఎంఎఫ్, మెరిట్ కింద మెట్రిక్ టన్నుకు రూ.88 ఉండగా... ఆ ఫీజులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు అక్రమంగా ఇసుకను తరలించకుండా రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నదీ పరివాహక గ్రామాల ప్రజలు పంచాయితీ సెక్రటరీల అనుమతితో సొంత పనులు, గ్రామ అవసరాలు, కమ్యూనిటీ పనుల కోసం యంత్రాలు లేకుండా ఎద్దుల బండ్లు లేదా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, గనుశాఖ డీడీ రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వసూళ్లు..!

5వ పేజీ తరువాయి

వైసీపీ ప్రభుత్వం అండతో గత ఐదేళ్లు సదరు నాయకుడు రెచ్చిపోయాడు. దుకాణాల అనుమతుల విషయంలో తన మాటకు ఎదురు లేకుండా చూసుకున్నాడు. రెండేళ్ల కిందట టపాసులు దుకాణాల అనుమతుల పేరిట డబ్బులు వసూలు చేసి, చివరి రోజు వరకు అనుమతులు తీసుకోలేదు. కనీసం ప్రభుత్వానికి కట్టాల్సిన రుసుము కూడా చెల్లించకుండా మొత్తం తన జేబులో వేసుకుందామని చూశాడు. ఈ విషయం తెలియని దుకాణాదారులు దుకాణాల ఏర్పాటుకు సిద్ధమయ్యారు. దుకాణాలకు అనుమతులు లేకపోవటంతో అధికారులు సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశారు. అడిగినంత డబ్బులు ముట్టజెప్పిన తర్వాత కూడా తమకు ఈ ఇబ్బంది ఏమిటంటూ.. సదరు నాయకుడి వద్దకు దుకాణాల యజమానులు పరుగెత్తారు. సదరు నాయకుడు తన పరపతిని ఉపయోగించి అప్పటికప్పుడు అధికారులకు చలానా రుసుములు చెల్లించి ఆఖరి నిముషంలో అనుమతుల తీసుకున్నాడు.

అధికారులు అడ్డుకట్ట వేయాలి



దీపావళి దుకాణాల అనుమతి పేరిట కొంతమంది వ్యక్తులు ప్రతి ఏటా దందాలు కొనసాగిస్తున్నారు. వీరు అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ వైపు ఉంటూ తమ పబ్బం గడుపుకుంటారు. ఎక్కువ డబ్బులు ముట్టజెప్పే దుకాణాదారులు వాటిని తిరిగి సంపాదించేందుకు ఎక్కువ ధరలకు టపాసులు అమ్మాల్సి వస్తుంది. ఇది పండుగ చేసుకోవాలనుకునే వారిపైన భారమే అవుతుంది. దందాలు చేసే వారికి అధికారుల అడ్డుకట్ట వేయాలి.

- బాబా ఫక్రుద్దీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి, నంద్యాల



అధికారుల నిర్లక్ష్యం..

దుకాణాల అనుమతులు విషయంలోనే కాకుండా దుకాణాల ఏర్పాటు విషయంలో కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టపాసులు దుకాణాల ఏర్పాటు చేసేముందు అధికారులు యజమానుల నుంచి ఫారం - 5 దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంటుంది. ఎవరు దుకాణాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారో వారే అనుమతుల కోసం సంప్రదించాల్సి ఉంటుంది. కానీ ఒకే వ్యక్తి ద్వారా అనుమతులు వస్తున్నా, ఇదేమిటని సంబంధిత అధికారులు అడగకపోవడం గమనార్హం. ఇక దుకాణాల ఏర్పాటు విషయంలో కూడా ఓ పద్ధతిని అధికారులు పాటిస్తున్నట్లు కనిపించటం లేదు. సాధారణంగా టపాసుల దుకాణాలను ఇంగ్లీషు అక్షరం 'ఎల్' మాదిరి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇక దుకాణాలను ఒకే మైదానంలో 50కు మించి ఏర్పాటు చేయకూడదు. కానీ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కలాశాలలో దాదాపు 76 దుకాణాలను ఏర్పాటు చేయడమే కాకుండా, దీర్ఘ చతురస్రాకారంలో ఏర్పాటు చేస్తున్నారు.

పోలీసుల రక్తదానం

నంద్యాల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నంద్యాలలో పోలీసులు రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్, రక్తదాన శిబిరాల్లో పలువురు పోలీసులు రక్తదానం చేయగా, బీపీ, షుగర్, గుండె సంబంధిత సమస్యలకు, కళ్లు, ఎముకలు, స్త్రీ సంబంధిత సమస్యలు, సాధారణ జబ్బులకు వైద్య సేవలు అందించారు. ముందుగా ఎస్పీ రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో దాదాపు 154 మంది పోలీస్ సిబ్బంది, వారి కుటుంబాల సభ్యులు పాల్గొని వైద్యసేవలు పొందారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ సబ్ డివిజన్లలో రక్తదాన, వైద్యశిబిరాలు నిర్వహిస్తామని ఎస్పీ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 167మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రెడ్‌క్రాస్ సొసైటీ బృందం దస్తగిరి, ఉస్మాన్‌బాష, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, టెక్నీషియన్ మల్లికార్జున,దామోదర్, ఇర్ఫాన్‌ల సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు, శాంతిరామ్ ఆస్పత్రి వైద్యులు అరుణ, ఉదయ్‌మోహన్, సుధాకర్‌రెడ్డి, గౌతమి, దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.




రక్తదానం చేస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

పైసల ప్లానింగ్

(5వ పేజీ తరువాయి)

నిత్యం పట్టణ ప్రణాళికా విభాగం పని తీరుపై ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు వస్తూనే ఉంటాయి. పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య భవనాలకు సంబంధించి స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నారు. సెట్‌బాక్స్ లేకుండా నిర్మిస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకవేళ స్పందించినా హడావుడి చేసి పనులు నిలిపివేస్తారు. నెల రోజుల తరువాత మళ్లీ అక్రమాలు కొనసాగుతున్నా పట్టించుకోరు. అక్రమ నిర్మాణాలపై విజిలెన్సు అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



ఎన్నికల సమయంలో ఇష్టారాజ్యం..

ఎన్నికల సమయంలో నగర పాలక ఉన్నతాధికారి రిటర్నింగ్ అధికారిగా పని చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దాదాపు రెండు నెలలుగా అధికారి బిజి బిజీగా ఉన్నారు. అంతే ఇదే అదునుగా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది అక్రమ ఆదాయానికి తెర లేపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేశారు. అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా స్ట్రక్చరల్ ఇంజనీర్, ప్లానింగ్ సెక్రటరీల అవినీతి అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ చేయాల్సిన ప్లానింగ్ సెక్రటరీ, చైన్‌మెన్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అదనపు ఫ్లోర్‌కు, అనుమతి లేని నిర్మాణాలకు రూ.2 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారని సమాచారం. ముడుపులు ఇస్తే నిర్మాణాలను సజావుగా సాగనిస్తారు. లేదంటే ఏదో ఒక రకంగా కొర్రిపెట్టి ఆపేస్తారు. సెక్రటరీల సంపూర్ణ సహకారం ఉండటంతో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అక్రమ సంపాదనకు తెరలేపారన్న ఆరోపణలు ఉన్నాయి.

మచ్చుకు కొన్ని అనధికార భవనాలు

● నగరంలోని కేవీఆర్ గార్డెన్‌లో అనధికారిక నిర్మాణాలు చేపట్టారు. ప్లాన్‌లో ఒక రకంగా చూపి మరో విధంగా పనులు చేశారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నోటీసులు మాత్రమే ఇచ్చారు. దీంతో భవన యజమాని నుంచి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి సైతం అక్రమ నిర్మాణాలు చేశారని, ఆ యజమాని నుంచి కూడా డబ్బులు వసూలు చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి.

● మద్దూర్ నగర్ మెయిన్ రోడ్డులో ఓ వాణిజ్య భవనం నిర్మిస్తున్నారు. నాలుగు ఫ్లోర్లలో నిర్మిస్తున్నా ఈ నిర్మాణానికి ఎలాంటి సెట్‌బ్యాక్స్ వదల్లేదు. మూడు వైపులా స్థలం వదలాలి. ఇక అదనంగా ఫ్లోర్లు కడుతున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

● కృష్ణా నగర్‌లో సెల్లార్ లేకుండానే ఐదు ఫ్లోర్లలో నిర్మాణం చేపడుతున్నారు. ఇదే దారిలో అదనంగా అనుమతులు లేకుండా ఫ్లోర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

● అశోక్ నగర్‌లో సెట్‌బ్యాక్స్ లేకుండా కేవలం ఐదు సెంట్లలో నాలుగు అంతస్తుల నిర్మాణం జరుగుతోంది. యజమాని చుట్టుపక్కల వాళ్లకి ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్మాణం చేపట్టాలి. అయితే ఎలాంటి నిబంధనలు పాటించకుండా నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎవరైనా అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటాం. కార్యదర్శులపై వివిధ ఆరోపణలు వస్తున్నాయి. విచారణ చేయించి సంబంధిత కార్యదర్శిపై చర్యలకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రణాళికా విభాగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రజలు కూడా సహకరించాలి.

-సి.ప్రదీప్‌కుమార్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి

అది ర్యాగింగ్ కాదు..!

● సీనియర్లు సలహా ఇచ్చారంతే
● కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ



కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో జూనియర్లకు సీనియర్లు సలహా మాత్రమే ఇచ్చారని, అది ర్యాగింగ్ ఎంతమాత్రం కాదని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ర్యాగింగ్‌పై పత్రికల్లో వచ్చిన కథనాలపై యాంటి ర్యాగింగ్ కమిటీతో విచారణ జరిపించి ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఎన్ఎంసీకి నివేదిక పంపినట్లు వెల్లడించారు. కాలేజీలో ఉన్న 242 మంది ఫ్రెషర్లను వేరువేరుగా మాట్లాడి లిఖిత పూర్వకంగా అభిప్రాయాలను తీసుకున్నామన్నారు. సీనియర్లు, జూనియర్ల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉందని తెలిపారని వివరించారు. తమ విచారణలో క్లాసులకు షూ వేసుకుని వెళ్లాలని, నీట్‌గా షేవ్ చేసుకోవాలని స్టడీ పర్పస్ రిఫరెన్స్ కోసం స్టడీ యాప్‌లను సీనియర్లు సూచించారని చెప్పారు. ఏదైనా సంఘటన జరిగితే సమాచారం ఇస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

తిరుపతి నుంచి సీఆర్ రీడర్ కర్నూలుకు..

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి చొరవతో తిరుపతి ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా ఉన్న ఫ్యూజీ సీఆర్ రీడర్ కర్నూలుకు చేరింది. తిరుపతిలో ఉన్న సీఆర్ రీడర్ అదనంగా ఉన్నట్లు సమాచారం తెలుసుకుని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఇక్కడి రోగుల రద్దీని తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభుకు తెలియజేశారు. రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సీఆర్ రీడర్‌ను కర్నూలు జీజీహెచ్‌కు కేటాయించాలని పలుమార్లు లేఖలు రాశారు. ఇందుకు స్పందించిన తిరుపతి ఆసుపత్రి సూపరింటెండెంట్ మిషన్‌ను కర్నూలుకు పంపించారు. దీంతో కర్నూలు జీజీహెచ్ రేడియాలజి విభాగంలో సోమవారం సీఆర్ రీడర్ ప్రింటర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ యంత్రం ద్వారా రోగులకు ఎక్స్‌రే ఫిల్మ్ ప్రింటు త్వరగా ఇవ్వడం జరుగుతుందని సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రేడియాలజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరినాథ్, డిప్యూటీ సివిల్ సర్జన్ వెంకటరమణ, చీఫ్ రేడియోగ్రాఫర్ రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఆర్ రీడర్ సేవలను ప్రారంభిస్తున్న డా.హరినాథ్

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు


అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను సోమవారం నుంచి నవంబరు 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల నిర్వహణలో భాగంగా సమగ్రత, అవినీతి నిర్మూలన, లంచం ఇవ్వచూపడం, తీసుకోవడం నేరం వంటి అంశాలపై అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి నవంబరు 3వ తేదీ వరకు కల్చర్ ఆఫ్ ఇంటెగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పర్టీ అనే థీమ్‌తో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పబ్లిక్‌లో అవినీతి నిర్మూలనపై క్విజ్ పోటీలు, వాక్‌థాన్‌లు, మారథాన్‌లు, వీధి నాటకాలు, గ్రామసభలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సోషల్ మీడియా ద్వారా వీటి గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైలెంట్ కిల్లర్..!

- బీపీ, షుగర్, కొలెస్ట్రాల్‌తో పక్షవాతం
- ఏటా 18 లక్షల మందికి స్ట్రోక్
- నిమిషానికి ఇద్దరికి చొప్పున బాధితులు
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జీవనశైలిలో అనేక రకాల వ్యాధులు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా గుండె, బ్రెయిన్‌కు సంబంధిత వ్యాధులతో జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యం. ఇప్పుడున్న రోజుల్లో చాలా మంది బిజీ లైఫ్‌లో ఆరోగ్యంపై సరైన దృష్టి సారించడం లేదు. దేశంలో గుండెపోటు తర్వాత ఎక్కువ మందిని బలికొంటున్న వ్యాధి పక్షవాతం. ఒక్కసారిగా మనిషిని కుప్పకూల్చే మహమ్మారి కేసులు చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌తో పాటు మారిన ఆహారపు అలవాట్లు జీవన విధానం బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సమస్యలో అత్యధికంగా మరణిస్తున్న వ్యాధుల్లో గుండెజబ్బులు ప్రథమ స్థానంలో ఉండగా.. ఆ తర్వాత క్యాన్సర్ రెండో స్థానంలో ఉంది. గడిచిన 10 సంవత్సరాలుగా క్యాన్సర్ స్థానంలో బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధులు రెండో స్థానంలో చేరుకున్నాయి. ప్రతి నిమిషానికి ఇద్దరు చొప్పున బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. ఏటా దేశంలో 18 లక్షల మంది బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మరణించడం, అంగవైకల్యం పొందడం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా బ్రెయిన్ స్ట్రోక్ బారినపడే వారి సంఖ్య పెరుగుతుండటంపై ఈ వ్యాధి నిరోధించడానికి ప్రతి సంవత్సరం అక్టోబరు 29న వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే నిర్వహిస్తున్నారు.

జీజీహెచ్‌లో స్ట్రోక్ యూనిట్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రాష్ట్రంలోనే తొలిసారిగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో 2024 ఫిబ్రవరి 20న న్యూరో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (స్ట్రోక్ ఐసీయు)ను అప్పటి కలెక్టర్ సృజన, సూపరిం టెండెంట్ జి.వెంకట రంగారెడ్డి ప్రారంభించారు. 10 పడకలతో బ్రెయిన్ స్ట్రోక్ రోగులకు 24/7 సేవలు అందించేందుకు వీలుగా చిన్నపిల్లల విభాగం లోని రెండో అంతస్తులో ఏర్పాటు చేశారు. స్ట్రోక్ ఐసీయూ రావడంతో రోగులకు క్యాజువాల్టీ, ఏఎంసీలో కాకుండా స్ట్రోక్ యూనిట్ పెట్టి న్యూరాలజి విభాగపు వైద్యులు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ప్రతి ఏడాది 1000 మంది బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు చికిత్స చేస్తున్నారు.



పెద్దాసుపత్రిలోని స్ట్రోక్ ఐసీయూ యూనిట్

ఉమ్మడి జిల్లాలో 5 లక్షల మంది బాధితులు

ఉమ్మడి జిల్లాలో దాదాపు 50 లక్షల జనాభా ఉంది. మొత్తం జనాభాలో 5 లక్షల మంది బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కర్నూలు, నంద్యాల, ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉన్న నెట్‌వర్క్ హాస్పిటల్‌లో కూడా బ్రెయిన్ స్ట్రోక్‌కు చికిత్స ఉంది.

ప్రతి నలుగురిలో ఒకరు



25 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి నలుగురిలో ఒకరికి తమ జీవన కాలంలో బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారు. స్ట్రోక్ వచ్చిన మొదటి గంట అంటే 60 నిమిషాల్లో ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందిలా చేస్తే ప్రాణాపాయం తప్పినట్లే. స్ట్రోక్ లక్షణాలు గుర్తించిన మొదటి గంటలోపు కనీసం నాలుగున్నర గంటల్లోపు ఆసుపత్రిలో చేరాలి. ముఖ్యంగా పని ఒత్తిడి, స్మోకింగ్ మద్యపానం అలవాటు వల్ల స్ట్రోక్‌కు గురవుతున్నారు. **- డాక్టర్ ఎం.నాగసురేష్, న్యూరోఫిజిషియన్, కర్నూలు మెడికల్ హాస్పిటల్**


ఎలా గుర్తించాలి

- ఒక వైపు చేయి.. కాలు పని చేయకపోవడం ఫలితంగా నడవడానికి ఇబ్బంది పడటం.
- అకస్మాత్తుగా తల తిరగడం, శరీరంలో బ్యాలెన్స్ కోల్పోవడం.
- మూతి ఒక వైపునకు వంకరగా పోవడం.
- మాట తడపడటం..సరిగ్గా మాట్లాడలేకపోవడం.
- సడెన్‌గా చూపు సరిగ్గా కనపడకపోవడం.
- తీవ్రమైన తలనొప్పి, వాంతులు కావడం, స్పృహ కోల్పోవడం.

స్ట్రోక్‌కు కారణాలు

- దీర్ఘకాలిక జబ్బులైన బీపీ, షుగర్ నియంత్రణలో లేకపోవడం.
- ధూమపానం చేయడం, మద్యం అతిగా సేవించడం
- స్థూలకాయం కారణంగా ఒంట్లో కొవ్వు స్థాయి పెరిగిపోవడం
- గుండె జబ్బులకు మందులు సరిగ్గా వాడకపోవడం, కొంత మందిలో పుట్టుకతోనే జన్యుపరమైన లోపాలు ఉండడం.

20 నుంచి 30 శాతం స్ట్రోక్ కేసులు



కర్నూలు జీజీహెచ్‌లో వారంలో ప్రతి సోమవారం గురువారం ఓపీ ఉంటుంది. వారంలో ఓపీకి 500 నుంచి 600 మంది రోగులు వస్తుంటారు. వీరిలో 20 నుంచి 30 శాతం మంది బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు వస్తున్నారు. బ్లడ్ క్లాట్ అయిన కేసుల్లో 89 శాతం ఉండగా. 20 శాతం బ్లీడింగ్ కేసులు ఉంటాయి. బీపీ, షుగర్, స్మోకింగ్, ఆల్కహాల్, వ్యాయామం లేకపోవడం, ఒబెసిటీ వల్ల పక్షవాతం కేసులు వచ్చే అవకాశం ఉంది. కర్నూలు జీజీహెచ్ స్ట్రోక్ ఐసీయూలో 24 గంటలు వైద్యుల పర్యవేక్షణలో రోగులకు సేవలు చేస్తున్నారు. **- డాక్టర్ సి.శ్రీనివాసులు, హెచ్‌వోడీ, న్యూరాలజీ విభాగం, కర్నూలు జీజీహెచ్**

స్ట్రోక్‌ను త్వరగా నిర్ధారించాలి



స్ట్రోక్ అనేది అత్యవసర పరిస్థితి. రోగ నిర్ధారణ వేగం పెంచాలి. సిటీ స్కాన్, ఎంఆర్ఐ బ్రెయిన్ వంటి పరీక్షలు చేయించాలి. స్ట్రోక్ వచ్చిన మొదటి 4 నుంచి 5 గంటల అత్యంత కీలకం స్ట్రోక్. చికిత్స తీసుకో వడం కంటే జాగ్రత్త పడటం మంచిది. కూరగా యలు, పండ్లు, ఎక్కువగా తీసుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించాలి. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవాలి. **- డాక్టర్ చల్లపల్లి బాబురావు, న్యూరాలజిస్టు, కిమ్స్ హాస్పిటల్**

సమస్యలను పరిష్కరిస్తాం

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన వినతులను పూర్తి స్థాయి విచారించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 115 వినతులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అన్నారు. సోమవారం అందిన వినతుల్లో ఎక్కువగా కుటుంబకలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనివారు సమీప పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, డీఎస్పీ ఆఫీసుల్లో వినతులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు పాల్గొన్నారు.

ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగాలి

- సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి


డ్రోన్‌ను పరిశీలిస్తున్న న్యాయాధికారి తంగమణి, ఎమ్మెల్యే కోట్ల

డోన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి అన్నారు. పట్టణంలోని డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ గీత అధ్యక్షతన జోనల్ సైన్స్‌ఫేర్‌ను సోమవారం సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యార్థుల చదువులు ఉండాలని అన్నారు. ఉన్నతమైన ఆశయంతో అడుగులు వేయాలని సూచించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ విద్యార్థినుల్లో మేధోసంపత్తిని పెంపొందించేందుకు సైన్స్‌ఫైర్‌లు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థినులు తమ పరిజ్ఞానంతో తయారు చేసిన ప్రదర్శనలు వారి లోని ప్రతిభను తెలియజేస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తు అంతా సైన్స్ మీదనే ఆధారపడి ఉంటుందని, అందుకు అనుగుణంగా పరిజ్ఞానాన్ని పెంపొం దించుకోవాలని సూచించారు. డీసీవో శ్రీదేవి మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థినుల్లో సృజనాత్మకత, మేధోసంపత్తిని పెంచేలా శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో అనంతపురం డీసీవో ఉదయ శ్రీ, సీఐలు ఇంతి యాజ్ బాషా, రాకేష్, ఎస్ఐ మమత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, ఓబులాపురం శేషిరెడ్డి, సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, భాస్కర్ నాయుడు, ఓంప్రకాష్, రామిరెడ్డి, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల నుంచి తరలివచ్చిన విద్యార్థినులు

పట్టణంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన జోనల్ సైన్స్‌ఫేర్‌కు కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన గురుకుల పాఠశాలల విద్యార్థినులు తరలి వచ్చారు. మొత్తం 73 పాఠశాలల విద్యార్థినులు సైన్స్‌ఫేర్‌లో పాల్గొని తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. వెల్దుర్తి గురుకుల పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన డ్రోన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. డ్రోన్ పరికరాలను తయారు చేసిన విద్యార్థినులు, ఉపాధ్యాయులను న్యాయాధికారి తంగమణి అభినందించారు. అదేవిధంగా వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు తీసుకువచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

హమ్మయ్యా.. సర్వర్ పని చేస్తోంది..!

- ఊపిరి పీల్చుకున్న అధికారులు, రైతులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఈనామ్ సర్వర్ పని చేయడం మొదలు పెట్టింది. దీంతో మార్కెట్ యార్డు అధికారులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఉల్లి ఉత్పత్తుల విక్రయాలు ఇక చకచకా సాగిస్తామని, రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని కర్నూలు మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ఉల్లితోపాటు వేరుశనగ, మొక్కజొన్న, ఆముదాలు, సద్దలు, కొర్రలు, తదితర పంట ఉత్పత్తులన్నీ విక్రయించేందుకు సమస్య తొలగిపోయినట్లేనని సెక్రటరీ స్పష్టం చేశారు.

సచివాలయంలో సభ్యత్వ నమోదు తప్పు

- ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో సభ్యత్వం నమోదు తప్పు అని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదోని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకు రాలు గుడిసె కృష్ణమ్మ అనుచరగణంతో ఆదివా రం ఆదోని మండలం బైచిగేరి సచివాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయంలో సభ్యత్వ నమోదు అనే శీర్షికను ప్రచురించిన ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీవో స్పందించి సచివాలయ కార్యదర్శి, సిబ్బందిని విచారించి నివేదిక ఇవ్వాలని కోరారు. ఇలా పార్టీలకు సంబంధించిన నాయకులు పార్టీ కార్యకలా పాలను ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించడం తప్పన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవడంతోపాటు అన్ని సచివాలయాల ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.


బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

వ్యవసాయ బుక్‌లెట్ల ఆవిష్కరణ

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ బుక్‌లెట్స్‌ను కలెక్టర్ రంజిత్ బాషా ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించిన ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన బుక్‌లెట్స్‌ను ఆవిష్కరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల సాంకేతిక పరిజ్ఞానాన్ని, సమాచారాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. సాధికార సంస్థ హ్యాండ్‌బుక్‌లెట్ల, ప్యాకెట్ బుక్‌లెట్లను ప్రచురించారని అన్నారు. ఇవి జిల్లాలోని 25 మండలాల్లో గల 141 రైతుసేవా కేంద్రాలు, 247 గ్రామ ఐక్య సంఘాల్లోని మహిళా రైతులకు అందేలా చూడాలని సూచించారు. జేసీ నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు

వైద్యుల సమస్యలు పరిష్కరిస్తాం


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ శబరి

- ఎంపీ డా. బైరెడ్డి శబరి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీ డా. బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం నంద్యాల మధుమణి సమావేశ భవనంలో నంద్యాల ఐఎంఏ నూతన అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ డా.బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్యులపై దాడులు దారుణమన్నారు. వైద్యుల రక్షణ చట్టాన్ని బలోపేతం చేయడానికి, కేంద్రస్థాయిలో వైద్యుల రక్షణ చట్టం తీసుకురావడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. అనంతరం ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదనరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. డాక్టర్ రవికృష్ణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించి ఎంపీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం వైద్యులు అందరూ కలిసి ఎంపీ శబరిని సత్కరించారు.

ఇద్దరి అరెస్టు

ఆదోని రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన గోవిందప్ప, ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన బోయ దేవేంద్రలను ఇస్బీ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ద్విచక్ర వాహనాల్లో మద్యం తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 48 మద్యం బాటిళ్లను, రెండు కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


బోల్తా పడిన వాహనం

ఆస్పరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిగిలి గ్రామ బస్టాప్ సమీపంలోని మలుపు వద్ద పత్తి లోడుతో వెళ్తున్న బొలేరో, స్కూటర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వీరేష్, గోవర్ధన్, మల్లిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించారు. బాధితుల బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పాణ్యం కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా కదిరికోట రవికిరణ్

గడివేముల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ లక్ష్మీనరసింహ యాదవ్ పాణ్యం నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్‌గా కదిరికోట రవికిరణ్‌ను ఎంపికచేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని, బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని కదిరికోట రవికిరణ్ తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు పుష్పగుచ్ఛం అందజేశారు. తనకు నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.


వైఎస్ షర్మిలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కదిరికోట రవికిరణ్

ప్రాథమిక హెల్త్ సెంటర్ల అభివృద్ధికి కృషి చేస్తాం

● నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి

నందికొట్కూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తామని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం పట్టణంలోని పగిడ్యాల రోడ్డులోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ హెల్త్ కేర్ సెంటర్‌ను నిర్మించారన్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో అన్ని మౌలిక సౌకర్యాలు, సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎంపీ తెలిపారు. దేశంలో 1.5 లక్షల ప్రైమరీ హెల్త్ సెంటర్లు అప్‌గ్రేడ్ అయ్యాయని, నియోజకవర్గంలో ఉన్న వాటిని కూడా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం వైద్యం ఖర్చులు పెరుగుతున్నందున ప్రభుత్వమే వైద్యాన్ని అందించేందుకు ఈ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తోందన్నారు. పేదలకు వైద్యన్ని చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు.

● ప్రజారోగ్యానికే పెద్దపీట: ఎమ్మెల్యే

ప్రజల ఆరోగ్యానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు పట్టణంలోని కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.80 లక్షలు కేంద్రం, మున్సిపాల్టీ జనరల్ ఫండ్ నిధులు రూ. 30 లక్షలు మొత్తం రూ.1.10 కోట్లతో ఈ ప్రాథమిక హెల్త్ సెంటర్ల నిర్మాణం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు త్వరితగతిన అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ రబ్బాని, 24వ వార్డు కౌన్సిలర్ చాంద్‌బాష జాకీర్, చిన్నరాజు, రావూఫ్, లాలుప్రసాద్, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, ముర్తుజావళి, లాయర్ జాకీర్, నాగేశ్వరరావు, డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి, జమీల్, సుకూర్, మున్సిపల్ కమిషనర్ బేబి, ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జి డా. షాజితా ఫిర్‌దోస్ పాల్గొన్నారు.


ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రెడ్‌క్రాస్ అభివృద్ధికి సహకరిస్తాం

నంద్యాల కల్చరల్: నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ అభివృద్ధికి సహకరిస్తామని ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. సోమవారం రెడ్‌క్రాస్, ఆయుష్ యోగా సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న నేత్రదాన అవగాహన సదస్సులకు, కమిటీలకు సహకరించాలని ఎంపీ డా.బైరెడ్డి శబరికి వినతి పత్రం అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ మనం చనిపోయిన తర్వాత మన నేత్రాలు మట్టిలో కలిసిపోకుండా నేత్ర దానం చేయడం ద్వారా ఇద్దరికి చూపును ప్రసాదించే అవకాశం ఉందన్నారు. రెడ్‌క్రాస్‌వారికి వెహికల్ ఏర్పాటుకు తనవంతు సహకరిస్తామన్నారు.కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ దస్తగిరి పర్ల, యోగా సభ్యులు ఆనంద్‌గురూజీ, నేత్రదాన కమిటీ కన్వీనర్ జనార్దన్‌శెట్టి పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

నంద్యాల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం ప్యాకెట్లను అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం శ్రీనాథ్‌గౌడ్ అనే వ్యక్తి కర్ణాటకకు చెందిన 31టెట్రా మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. మద్యం ప్యాకెట్లతోపాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొగ్గులైన్ సమీపంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (43)అనే వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి సోమవారం తెలిపారు. రైతు నగర్‌కు చెందిన ప్రవీణ్ కుమార్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని, ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి మృతి చెందాడని చెప్పారు. మృతుడి భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నంద్యాల మండలంలోని చాబోలు వద్ద ఉన్న నాలుగు రోడ్ల జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చాబోలు గ్రామానికి చెందిన సాల్మన్ (53) తన ద్విచక్ర వాహనంపై నంద్యాల నుంచి గ్రామానికి బయలుదేరాడు. జాతీయ రహదారిని దాటే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన సాల్మన్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నంద్యాల ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

దొంగల అరెస్ట్


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ అస్రార్‌బాషా

నంద్యాల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు తాలుకా అర్బన్ సీఐ అస్రార్‌బాషా తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొన్నాపురం కాలనీ, శిల్పా నగర్‌లో జరిగిన చోరీల్లో దొంగల నుంచి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బండిఆత్మకూరు మండలం కడమల కాల్వ గ్రామానికి చెందిన డక్కా కిరణ్‌బాబు, నంద్యాల పట్టణం షాదిక్ నగర్‌కు చెందిన షేక్ హుసేన్‌బాషాలు సోమవారం మధ్యాహ్నం రైతునగరం నాలుగు రోడ్ల హైవేపై అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఎస్ఐ గంగయ్య, సిబ్బంది చంద్రశేఖర్, నాయుడు, పవన్‌లను సీఐ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

వెలుగోడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏవో పవన్‌కుమార్ సమక్షంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఉప తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యమైన పంటలు పండించి నేల సారవంతం చెందడమే కాకుండా ప్రజా ఆరోగ్యం పెంచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండిస్తున్న పంటల తీరును దిగుబడిని ఖర్చులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నారయణస్వామి, సుందరం, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు సీపీఎం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మిడ్తూరు మండల కేంద్రంలోని 40 దళిత కుటుంబాలకు 1996లో అలగనూరు పోలిమెరలో పట్టా, పాసుపుస్తకాలు ఇచ్చినా భూములు చూపలేదని, వెంటనే వారికి భూములు చూపాలన్నారు. పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కాలనీలో 589, 590, 595 సర్వే నెంబర్లు దాదాపు 300 మంది పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి వెంటనే పట్టాలు మంజూరు చేసి పక్కా, గృహాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బాబు, ప్రజా సంఘాల నాయకులు రషీద్, జావిద్, జయరాం, తిరుపతయ్య, నాగన్న, నాగశేషులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణాలను శుభ్రం చేసే మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన మున్సిపల్ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ బేబికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పరమేష్, నాగేశ్వరరావు, డ్రైవర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బండిఆత్మకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.లింగాపురం గ్రామంలో సుజాత (34)అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు వేళాడుతూ కనిపించిందని, తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని సుజాత తండ్రి తెలిపారు. అదే గ్రామానికి చెందిన మాధవరెడ్డి అనే వ్యక్తితో పదేళ్ల కిందట వివాహమైంది. మృతురాలి తండ్రి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వడ్డెర ఫెడరేషన్‌కు రూ. 500 కోట్లు కేటాయించాలి

వెలుగోడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, రాజకీయంగా వెనకబడిన వడ్డెర కులస్తులను ఆదుకునేందుకు వడ్డెర ఫెడరేషన్‌కు రూ. 500 కోట్లు కేటాయించాలని వడ్డెర సంఘం జాతీయ కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం వారు వెలుగోడు తహసీల్దార్ శ్రీనివాసగౌడ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయిలో మైనింగు గనులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఒక్కో సొసైటీకి రూ. 40 లక్షలు కేటాయించి రాయితీలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య, శివభాస్కర్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం

నంద్యాల కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందామని యూఎన్డీపీ ప్రతినిధి రుషి పంత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో యూఎన్డీపీ, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు... పరిశ్రమలు, డీఆర్డీఏ, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రిలిమినరీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. యూఎన్డీపీ ప్రతినిధి రుషిపంత్ మాట్లాడుతూ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల ప్రభావిత ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న వనరులను గుర్తించి ప్రజలకు స్థిరమైన అభివృద్ధి ప్రయోజనాలను అందించడమే ఓఈసీఎంఎస్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ యూఎన్డీపీ బృందం సభ్యులకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. నల్లమల అటవీప్రాంతాల్లో ఉన్న జీవ వనరులను గుర్తించి ప్రజలకు ఏవిధంగా ప్రయోజనాలు చేకూర్చగలమో అన్వేషించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్‌కుమార్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సాయి, ప్రశాంత్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనతో విద్యారంగం సర్వనాశనమైందని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రక్షాలన చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి లోకేశ్ వంద రోజులు దాటినా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ల హామీలపై స్పష్టతే లేదని అన్నారు. కాగా ఆత్మకూరు పట్టణంలో హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. అనంతరం తహసీల్దార్ రత్నరాధికకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అంజిబాబు, కిరణ్, బాలాజీ, దిలీప్ ఉన్నారు.

పాణ్యం, అక్టోబరు 28 : విద్యార్థుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు వేణు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న వసతి, విద్యాదీవెన నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం హాస్టళ్లకు కేటాయించిన కాస్మోటిక్ చార్జీలు రూ.15 వందలను రూ. 3 వేలకు పెంచాలని కోరారు. హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

క్షయ, కుష్ఠు రోగులను గుర్తించాలి

గడివేముల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): క్షయ, కుష్ఠు రోగులను గుర్తించి వారికి వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి శారదాబాయి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ క్షయ, కుష్ఠు వ్యాధులను పటిష్ట చర్యలతో నివారించవచ్చని అన్నారు. వ్యాధిగ్రస్తులు ప్రణాళికాబద్ధంగా క్రమం తప్పకుండా మందులు, పోషకాహారం తీసుకోవాలని అన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు రంజితకుమారి, నస్రీమ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి శారదాబాయి

కార్యకర్తలందరూ సభ్యత్వం తీసుకోవాలి

నంద్యాల రూరల్, అక్టోబరు, 28 (ఆంధ్రజ్యోతి) :తెలుగుదేశం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంపై నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి సోమవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పార్టీలో భారీస్థాయిలో సభ్యులను చేర్పించాలని కోరారు. సమావేశంలో గోస్పాడు, నంద్యాల టీడీపి కన్వీనర్లు గురునాదరెడ్డి, చంద్రశేఖర రెడ్డి ఫ్లోర్‌లీడర్, కౌన్సిలర్ మాబు. వలి పాల్గొన్నారు.

పాములపాడు: టీడీపీ సభ్యత్వాన్ని ప్రతి కార్యకర్త తీసుకోవాలని టీడీపీ నాయకులు హుస్సేన్‌బాషా అన్నారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో సోమవారం ఇంటింటికి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బషీరు అహమ్మద్, సద్దాం హుస్సేన్, ఖాజహుస్సేన్, విజేయుడు, మురళీమోహన్, ఇమ్రాన్, ఫారూఖ్, మద్దిలేటి, లింగమూర్తి, అమానుల్లా, గోపాల్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కొత్తపలి: టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రూ.100లు చెల్లించి టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని లింగాపురం గ్రామ టీడీపీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి మాడుగుల శేఖర్ తెలిపారు. సోమవారం లింగాపురం గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి మద్దిలేటి, వంశీ పాల్గొన్నారు.

గడివేముల: కార్యకర్తలకు అండగా టీడీపీ ఉంటుందని మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, నరేంద్రారెడ్డి, ఐటీడీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన భూమా

కొత్తూరు హుండీ ఆదాయం రూ.20.18 లక్షలు

పాణ్యం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు దేవస్థానం హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. ఈ లెక్కింపులో రూ.20,18, 308 నగదు, 2 గ్రాముల 300 మిల్లీ గ్రాముల బంగారు, 925 గ్రాముల వెండి ఆదాయం చేకూరినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. నంద్యాల డివిజన్ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, బీరం శివరామిరెడ్డి, ప్రధాన అర్చకులు వీరయ్య, క్రిష్టయ్య, పోలీసులు రజాక్, ఏపీజీ బ్యాంకు అధికారులు ఇంద్రసేన, రాముడు, అప్రైజర్ మాధవస్వామి, నంద్యాల బాలాజీ సేవా సమితి అధ్యక్షురాలు సుభాషిణి, మహిళా సభ్యురాలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన చికెన్ ముక్క

● గొంతులో ఇరుక్కుని ఊపిరాడక బాలుడి మృతి

రాజంపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చికెన్ ముక్కా నోటిలో ఇరుక్కుని సుశాంక్ (2) అనే చిన్నారి ఊపిరాడక ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా సుగాలితాండకు చెందిన కృష్ణయ్య, మణి దంపతులు ఇరువురు కూలీ పనులు చేసుకుంటూ రాజంపేట పట్టణంలోని మన్నూరు సాతవీధిలో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం కృష్ణయ్య చికెన్ తెచ్చాడు. దానిని వండేందుకు పక్కన పెట్టగా చిన్నారి తెలియక ఒక ముక్కను మింగాడు. మధ్యాహ్నానికి ఆ బాలుడికి గొంతు దగ్గర వాపు రావడంతో పాటు శ్వాస కూడా సరిగ్గా తీసుకోలేకపోవడంతో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

యాగంటిలో పల్లకి సేవ ఉత్సవం


పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పల్లకి సేవ ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి


ఎంపీ బైరెడ్డి శబరిని కలిసిన హేమసుందర్ రెడ్డి

డోన్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ నడిబొడ్డులోని రైల్వేగేట్ల కింద అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి కోరారు. సోమవారం నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని కలిసి సమస్యను వివరించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, దానిని పరిష్కరించేందుకు రైల్వే బ్రిడ్జి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తలందరూ సభ్యత్వం తీసుకోవాలి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

ప్యాపిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వర రావు యాదవ్ కోరారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఆస్తి పంపకాల్లో సీఎం చంద్రబాబు పాత్ర ఉందని వైసీపీ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదుకు రాష్ట్రంలో విశేష స్పందన లభిస్తుండటం హర్షనీయమన్నారు. సభ్యత్వ తీసుకున్న కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు. డోన్ నియోజకవర్గంలో 50వేలు సభ్యత్వాలు చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నట్లు నాగేశ్వరరావుయాదవ్ తెలిపారు. సమావేశంలో నాయకులు రామ్మోహన్‌యాదవ్, రమేష్‌గౌడు, నాగేంద్ర, కోదండ రామయ్య కదిరప్ప, ఓబులేసు, మల్లి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదాం


పొదుపు మహిళలతో బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ చేయి చేయి కలిపి ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను పట్టణంలో పూర్తిగా నియంత్రించాలని ఇందుకు మహిళలు చేయూత నివ్వాలన్నారు. కార్యక్రమంలో పొదుపు మహిళలు, ఏపీఎం శ్రీనివాసులు, మహిళలు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ జారీ చేయాలి'

కొలిమిగుండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు క్రిష్టయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బెలుంశింగవరం గ్రామంలో నవంబరు 5న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో విజయవాడ గోడ పత్రికలను విడుదల చేశారు. మాదిగలు పెద్ద ఎత్తున విజయవాడకు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని క్రిష్టయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాల కంబయ్య, మద్దిలేటి, తిమ్మక్క, కంబక్క, నరసింహుడు, అచ్చమ్మ, పుల్లక్క, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

సమాజ సేవలో పోలీసుల పాత్ర కీలకం


ఆళ్లగడ్డలో రక్తదానం చేస్తున్న డీఎస్పీ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజ సేవ చేయడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణం లోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారం భించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం శ్రమించే పోలీసులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం సభ్యులతో పాటు సబ్ డివిజన్‌లోని పలువురు పోలీసులు, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీఐలు చిరంజీవి, వంశీధర్, పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి సోమవారం విశేష స్పందన లభించింది. రక్తదాతలకు ఎస్ఐ రమేష్‌రెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు.

ఉయ్యాలవాడ: మండలంలోని రేనాటి సూర్యచంద్రుల సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల యువకులు, పోలీసులు రక్తదానం చేశారు. రక్తదాతలను ఎస్ఐ వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో రేనాటి సూర్యచంద్రుల సేవాసమితి అధ్యక్షుడు డీకే బాబు, సుబ్బరాయుడు ఉన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏవీఆర్ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని యశశ్వి, నందు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పీఈటీ శివ పాపయ్య సోమవారం తెలిపారు. అలాగే పాఠశాలకు చెందిన యోజితేశ్వర్(అండర్-14) బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు యశశ్వి, నందులు త్వరలో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పీఈటీ శివ పాపయ్య, కోచ్ వాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రయాణం.. ప్రమాదకరం


కొలిమిగుండ్ల: బొలేరో వాహనంలో పనులకు బయలుదేరుతున్న కూలీలు

కొలిమిగుండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పొట్ట కూటి కోసం పనులకు వెళ్లే మహిళా కూలీల ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో అటు ఉపాధి పనులు, ఇటు రైతు కూలీ, ఇతర పనులు దొరకకపోవడంతో మండలంలో మీర్జాపురం, కొలిమిగుండ్ల, పేట్నికోట, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె తదితర గ్రామాల నుంచి సుమారు రెండు వేల మందికిపైగా మహిళా కూలీలు అనంతపురం జిల్లా తాడిపత్రి, యాడికి మండలాలకు, మరోవైపు సంజామల, కోవెలకుంట్ల తదితర మండలాలకు వెళ్తున్నారు. అయితే కూలీలు ఆటోల్లో ఓవర్ లోడుతో వెళ్తుండటం ప్రమాదకరంగా మారిం ది. గతంలో కూలీల ఆటోలు బోల్తా పడి, మృతి చెందిన ఘట నలు అనేకం ఉన్నాయి. ఒక్కో ఆటో లో 20 నుంచి 30మంది కూలీలు ప్రయా ణిస్తుండటం అత్యంత ప్రమాదకరం గా మారింది. ప్రమాదం జరుగక ముందే ఆటో డ్రైవర్లకు అధికారులు అవగాహన కల్పించి తక్కువ సంఖ్య లో కూలీలను తరలించేలా చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.


కొలిమిగుండ్ల: వాహనం టాప్ పైకి ఎక్కి పనులకు వెళ్తున్న కూలీలు

ఆటోల్లో పరిమితికి మించి వద్దు : ఎస్ఐ

దొర్నిపాడు: వాహనదారులు కెపాసిటికి మించి ప్రయాణికులను ఎక్కించు కుంటే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. సోమవారం ఎనిమిదిగాండ్ల మోరి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మా ట్లాడుతూ మండలంలో సీడు పత్తి సాగు అధికంగా ఉన్నందున చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆటో డ్రైవర్లు కెపాసిటికి మించి కూలీలను ఎక్కించుకొని వేగంగా వెళ్తుండటం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. అతి వేగం ప్రమాదకరమని అన్నారు. ఆటో డ్రైవర్లు కూలీలను ఎక్కువ సంఖ్యలో ఎక్కించుకోరాదని సూచించారు. దొర్నిపాడు ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని లేకుంటే జరిమాన విధిస్తామని అన్నారు.


దొర్నిపాడులో కూలీలకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ వెంకటేష్

అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో


అధికారులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో

రుద్రవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాలుగు డయేరియా కేసులు నమోదయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. సోమవారం రుద్రవరంలో ఆయన పర్యటించారు. డయేరియా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆహారం ఎలా తీసుకోవాలి, వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏడు రోజులపాటు వైద్య బృందాలు అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు మందులు పంపిణీ చేయాలని సూచించారు. అధికారులకు ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలన్నారు. అనారోగ్యంగా ఉంటే వెంటనే వైద్యశాలలకు సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం ఆఫీసరు జగదీష్ చంద్రరెడ్డి, వైద్యులు శ్రావణి, హుసేనీ, జ్యోతి తదితరులున్నారు.

ఫేషియల్ రికగ్నైజ్ సిస్టం అమలు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫేషియల్ రికగ్నైజ్ సిస్టం అమలు చేసిందని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. సోమవారం రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 19 అర్బన్ హెల్త్ కేంద్రాలు, 369 విలేజీ క్లినిక్‌లు ఉన్నాయన్నారు. ఉదయం 9 నుంచి 9.30లోపు, సాయంత్రం 4.40 నుంచి 5గంటల్లోపు ప్రతి ఒక్కరూ ఫేషియల్ రికగ్నైజ్ సిస్టంలో హాజరు తప్పని సరిగా వేయాల్సి ఉంటుందని అన్నారు. రుద్రవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అదనంగా లైట్లు ఏర్పాటు చేసి బెడ్‌షీట్లు కొనుగోలు చేయాలని వైద్యాధికారిణిని సూచించారు.

కాలనీలో పర్యటించిన అధికారులు

కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశాల మేరకు ఎంపీడీవో భాగ్యలక్ష్మి, తహసీల్దారు మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికుమార్, ఏఈ సుబ్రహ్మణ్యం గ్రామంలో దళిత కాలనీలో పర్యటించారు. పారిశుధ్యం లోపించకుండా ప్రజలు అధికారులకు సహకరించాలని సూచించారు.

ఎన్ఆర్ఐ ఔదార్యం

కొలిమిగుండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగుడి ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులపై ఎన్ఆర్ఐ రవీంద్రనాథరెడ్డి ఔదార్యం అభినందనీయమని హెచ్ఎం శ్రీవాణి అన్నారు. సోమవారం రవీంద్రనాథరెడ్డి తన తండ్రి కే.శే.రాజశేఖరరెడ్డి జ్ఞాపకార్థం పంపిన మెమొంటోలు, నగదు బహుమతులను పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం రవీంద్రనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏఈవోలుగా పదోన్నతి

రుద్రవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం, నరసాపురం రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న వీఏఏలకు ఏఈవోలుగా రాష్ట ప్రభుత్వం పదోన్నతి కల్పించినట్లు వ్యవసాయాధికారులు సోమవారం తెలిపారు. రుద్రవరం రైతుభరోసా కేంద్రంలో పనిచేస్తున్న నాగశ్రీ నరసాపురం రైతు భరోసా కేంద్రంలో పనిచేస్తున్న సునీతలకు పదోన్నతి కల్పించారు. సునీత సంజామల మండలానికి, నాగశ్రీ కొత్తపల్లె మండలానికి పదోన్నతిపై బదిలీ వెళ్లినట్లు అధికారులు తెలిపారు.


మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ విజయ్‌బాబు

5,568 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి

చాగలమర్రి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో 5,568 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తయినట్లు హౌసింగ్ డీఈ విజయ్‌బాబు తెలిపారు. సోమవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సబ్‌డివిజన్‌లో 9,502 గృహాలు మంజూరయ్యాయని, 5,568 గృహాలు పూర్తయ్యాయని వెల్లడించారు. 1,564 గృహాలు పనులు ప్రారంభించలేదని అన్నారు. లబ్ధిదారులకు 90 రోజుల ఉపాధి పనిదినాలు కల్పించాలని అన్నారు. బీఎల్ కింద 1,267 గృహాలు ఉన్నాయని తెలిపారు. చాగలమర్రి మండలంలో 2,316 గృహాలకుగాను 746 గృహాలు పూర్తయ్యాయని అన్నారు. బీఎల్ కింద 851 గృహాలు ఉన్నాయని తెలిపారు. హౌసింగ్ సహాయ అధికారులు పనులు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంపీవో నిర్మల, హౌసింగ్ ఏఈ నరసింహరావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఓబులేసు పాల్గొన్నారు.

యాగంటిలో ముగిసిన వేలం



యాగంటిలో వేలం నిర్వహిస్తున్న దేవాదాయశాఖాధికారులు

బనగానపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి క్షేత్రంలో సోమవారం ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో చంద్రుడు, మహేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. టెంకాయల విక్రయాన్ని రూ.13 లక్షలకు మీరాపురం రామనాథరెడ్డి దక్కించుకున్నారు. అలాగే కొబ్బరి చిప్పల సేకరణను రూ.1.50 లక్షలకు పాతపాడు సుబ్బరాయుడు దక్కించుకున్నారు. కాగా తలనీలాల వేలం వాయిదా పడింది. కార్యక్రమంలో ఆలయ పూజారి మహేశ్, ఆలయ సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

బేతంచెర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలో పారిశుధ్య ఇంజనీరింగ్, పర్మినెంట్ కార్మికులుగా పని చేస్తూ దీర్ఘకాలికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, సీఐటీయూ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ పర్యావరణం, ప్రజారోగ్యం, నగర పంచాయతీ పరిశుభ్రత కోసం పారిశుధ్య కార్మికులు సేవలందిస్తున్నారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం కమిషనర్ హరి ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, నాయకులు పాల్గొన్నారు

వైభవంగా సత్యమ్మ దేవత గ్రామోత్సవం


చాగలమర్రిలో కోలాటం ఆడుతున్న చిన్నారులు

చాగలమర్రి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో సత్యమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా సోమవారం గ్రామ దేవత సత్యమ్మను రజక సంఘం ఆధ్వర్యంలో వైభవంగా గ్రామోత్సవం చేశారు. చెన్న కేశవ ఆలయంలో నుంచి పురవీధుల గుండా కోలాట నృత్యం చేస్తూ ఊరేగించారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనులు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ నరసింహారెడ్డి

బేతంచెర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో 90 రోజులకు సంబంధించిన ఉపాధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీడీ నరసింహారెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ అధ్యక్షతన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల లేబర్ రిపోర్టు, గోకులాల నిర్మాణాలు, ఇంకుడు గుంతలు హౌసింగ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో ఏపీవో శేషన్న, ఏఈ హౌసింగ్ రామ్మోహన్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్థిక దోపిడీని అరికట్టాలి

బేతంచెర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ పేరుతో క్రాకర్స్ దుకాణాల యజమానులు చేసే ఆర్థిక దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో అఖిల భారత విద్యార్థి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలను దీపావళి పండుగకు దూరం చేయకుండా క్రాకర్స్ ధరలను అదుపులో ఉంచాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మారుతిలకు వినతి పత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, తరుణ్, మహ్మద్ రోహిత్, బాలాజి, శరత్, వహీద్, జశ్వంత్, చరణ్ రాజ్, మనోజ్ పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

బేతంచెర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో కలిసిమెలిసి టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య సూచించారు. సోమవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం టీడీపీ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ప్రారంభించారు. టీడీపీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంజామల, అక్టోబరు 28: మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సాల్మన్ సోమవారం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

జేజేఎం పనులుకు నిధులు మంజూరు


ఇన్‌చార్జి ఎస్ఈ

రుద్రవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జలజీవన్ మిషన్(జేజేఎం) కింద రూ. 290.74 కోట్లతో పనులు ప్రారంభించినట్లు ఇన్‌చార్జి ఎస్ఈ మనోహర్ అన్నారు. సోమవారం రుద్రవరంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 345 పనులు పూర్తి కాగా 49 పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. వీటి వల్ల జలజీవన్ మిషన్ పనులకుగాను రూ.12 కోట్లు నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. జిల్లాలో మంచినీటి పథకాలు అమలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి క్లోరినేజేషన్ చేయిస్తామని తెలిపారు. రుద్రవరంలో తాగునీటి సమస్యతో డయేరియా రాలేదని ఆయన సూచించారు. ఆయన వెంట డీఈ రవికుమార్, ఏఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక

చాగలమర్రి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఎంఈవో అనూరాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఏపీవో నిర్మల, ఏఈ కొండారెడ్డి పాల్గొన్నారు.

ఆవులను రోడ్లపైకి వదలొద్దు : సీఐ

బనగానపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆవులను రోడ్ల మీదికి వదలొద్దని సీఐ మంజునాథరెడ్డి కోరారు. సోమవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ పాడి రైతులు విచ్చలవిడిగా ఆవులను రోడ్ల మీదికి వదులుతుండడంతో వాహనదారులకు ఇబ్బందులు కల్గిస్తున్నాయన్నారు. ఆవులను ఇలాగే వదిలితే పంచాయతీ సిబ్బంది గోశాలలకు తరలిస్తారని హెచ్చరించారు.

డోన్ ఆర్డీవోగా నరసింహులు


ఎమ్మెల్యే కోట్లను కలిసిన ఆర్డీవో

డోన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డోన్ ఆర్డీవోగా కేపీ నరసింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్డీవో నరసింహులును తహసీల్దార్ నాగమణి, సర్వేయర్ జగదీష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్యాపిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుసేనాపురం హైస్కూలు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీకు ఎంపికయ్యారు. సోమవారం స్థానిక పాఠశాలలో క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు శివమ్మ మాట్లాడుతూ అండర్-17 ఖోఖో విభాగంలో రజిత, అండర్-14 కబడ్డీ విభాగంలో దినేష్, రామ్మోహన్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

రేపు గంగపుత్రుల సమావేశం

డోన్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గంగ పుత్రుల సమావేశాన్ని ఈ నెల 30న నిర్వహించనున్నట్లు గంగపుత్రుల సంఘం సభ్యులు సోమవారం తెలిపారు. కోట్లవారిపల్లె ప్రాంతంలో ఉన్న గంగమ్మ గుడి వద్ద జరిగే సమావేశంలో నూతన కమిటీ ఆలయ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశానికి గంగపుత్రులు హాజరు కావాలని కోరారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా రాముడు ఎన్నిక

డోన్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పట్టణ కార్యదర్శిగా మోట రాముడు, సహాయ కార్యదర్శిగా రామ్మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, మండల కార్యదర్శి నారాయణ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ సీపీఐ కార్యాలయంలో జరిగిన పట్టణ సమితి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

6న మండల సమావేశం

కొలిమిగుండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన ఎంపీడీవో కార్యాలయంలో వచ్చెనెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి సోమవారం వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిదులు తప్పక హాజరు కావాలని సూచించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

కోవెలకుంట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో వరప్రసాద్, యాపీఆర్డీ ప్రకాశ్ నాయుడులు అన్నారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో వరప్రసాద్, ఈవోపీఆర్డీ ప్రకాశ్ నాయుడుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా సలహాలు, సూచనలు ఇచ్చి వారికి దూరంగా ఉండేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

బేతంచెర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ ఆసపత్రిలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురా మధు సుధాకర్ రెడ్డి సహకారంతో గర్భిణులకు, రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు వలిబాషా, చంద్రశేఖర్‌రాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు

రుద్రవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నకంబలూరు గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం మోటారు సైకిల్ బోల్తా పడిన ఘనటలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మహానందిపల్లె మండలం గోపవరానికి చెందిన మురళి అనే వ్యక్తి రుద్రవరం మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె మెట్ట సమీపంలో ఉన్న గురప్ప స్వామి దేవాలయానికి వచ్చి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పోలీసుస్టేషన్ పరిధిలో తహసీల్దారు కార్యాలయం ముందు సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని కోవెలకుంట్ల పోలీసులు తెలిపారు. అతడి వయసు సుమారు 30 నుంచి 40సంవత్సరాలు ఉంటుందన్నారు. నలుపురంగు షర్టు, నసిం కలర్ పంచ ధరించి ఉన్నాడన్నారు. ఎవరైనా ఇతని ఆచూకీ తెలిస్తే కోవెలకుంట్ల పోలీలసును సంప్రదించాలని కోరారు.